# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికలు, పోలింగ్ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఘర్షణలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీశ్ కుమార్ గుప్తా కేంద్ర ఎన్నికల సంఘానికి వివరణ ఇచ్చారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, అనంతపురం పోలీస్ సూపరింటెండెంట్‌లను కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. తిరుపతి ఎస్పీ, పల్నాడు కలెక్టర్‌ను బదిలీ చేసింది.**

3. **రాష్ట్ర ఆదాయం పెరిగేలా సంస్కరణలు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో పోలీసు, ఇతర విభాగాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.**

5. **వచ్చే వానాకాలం నుంచి అమలయ్యే పంటల బీమా పథకానికి పటిష్ఠ కార్యాచరణను రూపొందించాలని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు, పోలింగ్ అనంతరం పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘర్షణలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీశ్ కుమార్ గుప్తా కేంద్ర ఎన్నికల సంఘానికి వివరణ ఇచ్చారు. వీరితో పాటు నిఘా విభాగాధిపతి కుమార్ విశ్వజిత్ కూడా కేంద్ర ఎన్నికల సంఘం ముందు హాజరయ్యారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల, నరసరావుపేట, తిరుపతి జిల్లా చంద్రగిరి, అనంతపురం జిల్లా తాడిపత్రిలో హింస చెలరేగడం, నివారణకు తీసుకున్న చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం వివరణ కోరింది. స్వయంగా తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ నిన్న ఢిల్లీ వెళ్లి ఎన్నికల సంఘం అధికారుల ఎదుట హాజరై శాంతిభద్రతలు అదుపు చేసేందుకు తీసుకున్న చర్యలను వివరించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ రోజు, ఆ తర్వాత చెలరేగిన దాడులపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో సమావేశం తర్వాత మూడు జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులను సస్పెండ్ చేయడంతో పాటు కొందరిని బదిలీ చేసింది. పల్నాడు, అనంతపురం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్లు గరికపాటి బిందుమాధవ్, అమిత బర్దార్‌ను సస్పెండ్ చేయడంతోపాటు తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ను బదిలీ చేస్తూ నిన్న రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వీరితో పాటు 12 మంది దిగువ స్థాయి పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ వారిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. కాగా.. రాష్ట్రంలో దాడులపై నమోదయ్యే ప్రతి కేసును ప్రత్యేకంగా తీసుకోవాలన్న ఎన్నికల సంఘం.. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అదే విధంగా రాష్ట్రంలో మరో 15 రోజులు కేంద్ర బలగాలను కొనసాగించాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది. పోలింగ్ అనంతర జరిగిన హింసపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది.

---------------------------

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 13వ తేదీ ఎన్నికల సందర్భంగా.. ఆ తర్వాత పల్నాడు సహా పలు జిల్లాల్లో ఘర్షణలు జరగడంపై రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎన్నికల తర్వాత కూడా దాడులు ఆగట్లేదని, వాటిని నియంత్రించేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, పోలీస్ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దాడులను అరికట్టాలని ప్రభుత్వ ప్రధానాధికారి, డీజీపీతోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి కూడా ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

దేశంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల తొలి నాలుగు దశల్లో 66.95 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న 97 కోట్ల మంది ఓటర్లలో ఈ నాలుగు విడతల్లో 45 కోట్ల 10 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని నిన్న ఒక ప్రకటనలో తెలిపింది. మిగిలిన మూడు దశల పోలింగ్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసింది. కాగా.. ఈనెల 13వ తేదీన జరిగిన నాలుగో దశ పోలింగ్‌లో 69.16 శాతం నమోదైంది. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి 3.65 శాతం ఎక్కువ ఓటింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంపు మార్గాలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో నిన్న నిర్వహించిన ఈ సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆదాయం పెరిగేలా సంస్కరణలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. భూముల మార్కెట్ విలువలు సవరించాలని, మార్కెట్ విలువను శాస్త్రీయంగా నిర్ధారించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లోని స్టాంపు డ్యూటీపై అధ్యయనం చేయాలని.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పన్ను ఎగవేతదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని.. జీఎస్టీ ఎగవేస్తే ఎవరినైనా ఉపేక్షించవద్దని స్పష్టంచేశారు. అక్రమ మద్యం రవాణా, పన్ను ఎగవేత లేకుండా చేయాలని అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో పోలీసు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానం నిన్న మార్గదర్శకాలు విడుదల చేసింది. రుసుము రహిత నంబర్, ఈమెయిల్ ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది. కేంద్ర పర్యావరణశాఖ తరచూ తనిఖీలు చేపట్టాలని.. ఆ సమాచారాన్ని రాష్ట్ర అధికారులకు అందించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పులోని ప్రతి అంశాన్ని తప్పక పాటించాలని.. కేంద్ర అధికారులు గుర్తించిన మైనింగ్ ప్రదేశాల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఆదేశించింది. జూన్ 9వ తేదీలోపు ఆదేశాల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడవిట్ సమర్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

---------------------------

వచ్చే వానాకాలం నుంచి అమలయ్యే పంటల బీమా పథకానికి పటిష్ఠ కార్యాచరణను రూపొందించాలని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. పంటల బీమా పథకం అమలు, ఇతర అంశాలపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. పంటల బీమా అమలుకు టెండర్ల నిర్వహణ, కంపెనీల అర్హతలు తదితర అంశాలపై చర్చించారు. పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై వెంటనే సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. వానాకాలం సన్నద్ధతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు వచ్చే నెలాఖరులోగా అందజేయాలని సూచించారు.

---------------------------

ఏపీఈఏపీసెట్–2024 ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌లోని 49 కేంద్రాల్లో మొదటిరోజు ప్రశాంతంగా జరిగిందని సెట్ ఛైర్మన్, జేఎన్‌టీయూ కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో కన్వీనర్ కె.వెంకటరెడ్డి, కోకన్వీనర్లు, కోఆర్డినేటర్లతో కలిసి నిన్న ఆయన పరిశీలించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి ఉదయం నిర్వహించిన పరీక్షకు 90.25 శాతం హాజరు నమోదైనట్టు కన్వీనర్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 90.98 శాతం హాజరు నమోదైందని అన్నారు. మొత్తం రెండు సెషన్‌లకు కలిపి 90.61 శాతం హాజరు నమోదైనట్టు కన్వీనర్ పేర్కొన్నారు. ఈరోజు కూడా అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు.

---------------------------

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను నిన్న సాయంకాలం అందుబాటులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులు తమ జర్నల్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే 70329 01383 నంబర్‌కు ఫోన్ చేయాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కాగా.. ఈనెల 20వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంకాలం 4 గంటల 30 నిమిషాల వరకు రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి.

---------------------------

మానవ జీవితంలో కీలక భూమిక పోషిస్తున్న టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ టెలి కమ్యూనికేషన్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1865వ సంవత్సరం మే 17 వ తేదీన అంతర్జాతీయ టెలి కమ్యూనికేషన్ యూనియన్ .....ఐ.టి.యు.... ఏర్పడిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా మే 17 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. మన దైనందిన జీవితంలో టెలి కమ్యూనికేషన్ ఒక నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ఆధునిక సమాచార వ్యవస్థలో ఇంటర్ నెట్, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, రేడియో, టెలివిజన్ వంటి అధునాతన సదుపాయాల వల్లనే ప్రపంచం పురోగతి సాధించగలుగుతోంది. అయితే... ఈ ఆధునిక సమాచార వ్యవస్థ దుర్వినియోగం కాకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉంది.

---------------------------

కొమరిన్ తీరం, దానికి ఆనుకుని దక్షిణ తమిళనాడు పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీని నుంచి లక్షద్వీప్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించిందని ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో నిన్న పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈరోజు, రేపు రాయలసీమలో అక్కడక్కడా పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది.

======================